క్లుప్తంగా

1న పారిశ్రామికవేత్తలతో సమావేశం

నెల్లూరు సిటీ: కాకుటూరు వద్ద ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో 2,870 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని ఇచ్చేందుకు టెండర్లు పిలిచామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముందస్తు బిడ్ సమావేశం నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో వచ్చే నెల 1వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజారవాణా అధికారి పీవీ శేషయ్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. వివరాలకు www.apsrtc.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఆగస్ట్ 8వ తేదీ వరకు టెండర్ వివరాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

లేగదూడలను సంరక్షించుకోవాలి



బహుమతి అందజేస్తున్న విజయకుమార్

నెల్లూరు సిటీ: రైతులు లేగదూడలను సంరక్షించుకుని మేలు జాతి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవాలని ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ అన్నారు. నెల్లూరులోని పొట్టేపాళెం గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా అమలు చేస్తున్న జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమం ద్వారా రైతులు మేలు జాతి పశువుల ఉత్పత్తి కోసం లేగదూడల పెంపకం చేపట్టాలని సూచించారు. ఇలాంటి శిబిరాలు ప్రతి మండలంలో వైద్యులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. 1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పశువైద్యం కోసం అంబులెన్స్‌ను ఉపయోగించుకోవాలని తెలిపారు. అనంతరం లేదదూడలలో జాతి లక్షణాలు, పెరుగుదల, పోషణను పరిశీలించి మేలుజాతి దూడలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఏడుకొండలు, పశువైద్యాధికారి సుమలత, వైద్యులు సురేష్, అరుణ, శివశంకర్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) రామ్మూర్తినగర్ బ్రాంచ్ పరిధిలోని నెల్లూరు రూరల్ మండలం పెద్దచెరుకూరు గ్రామంలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీధర్ మాట్లాడుతూ డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సీఈఓ డాక్టర్ శంకర్‌బాబు ఆదేశాలతో కళాబృందంతో వీధినాటకం ప్రదర్శన ద్వారా ఆర్థిక అక్షరాస్యత వల్ల కలిగే ప్రయోజనాలు, సహకార బ్యాంక్ సేవలు, బ్యాంక్ కార్యకలాపాలపై ఖాతాదారులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఖాతాదారులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి బ్యాంక్ ద్వారా తక్కువ వడ్డీకి అందజేసే రుణాలు, బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబు, సుష్మారెడ్డి, కళాకారులు, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో శని, ఆదివారాల్లో అన్నమాచార్య ఆరాధన సమితి, నెల్లూరు ఆధ్వర్యంలో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కేవీ సుధాకర్‌రాజు, ఉపాధ్యక్షుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి, సమన్వయకర్త దోర్నాల హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు బాలార్క శిష్య బృందంతో సప్తగిరి సంకీర్తనలు, రాత్రి 7 గంటలకు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతికి చెందిన ఆచార్య బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథ శర్మ ఆధ్యాత్మిక ప్రవచనం, రాత్రి 8.30 గంటలకు ఏకాంతసేవ నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సుప్రభాతం, తోమాలసేవ, అర్చన, తిరుప్పావడ, విశేష సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసుడు వినోద్ అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తారని, సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం జరుగుతుందని తెలియజేశారు.

ఆరోగ్యకర సమాజం కోసం కృషి

నెల్లూరు(బారకాసు): ఆరోగ్యకరమైన సమాజం కోసం వైద్యారోగ్య శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య అన్నారు. నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్‌హెచ్ఎం విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో శుక్రవారం డీఎంహెచ్‌ఓ పాల్గొని మాట్లాడారు. వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

గ్రామాల్లో జలకళ

పొదలకూరు ప్రజాసంకల్ప యాత్ర బహిరంగ సభలో మెట్ట పొలాల్లో ఉచితంగా బోర్ల నిర్మాణం హామీకి బీజం పడింది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులు పడుతున్న బాధలు చూసి హామీని ఇక్కడే ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రారంభించిన వైఎస్సార్ జలకళ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో సర్వేపల్లి నియోజకవర్గంలో ఈ పథకం వల్ల రైతాంగం లబ్ధి పొందుతున్నారు.

- రైతుల పొలాల్లో బోర్లు
- మంత్రి కాకాణి చొరవతో మంజూరు
- మెట్టప్రాంత రైతుల్లో ఆనందం



మొగళ్లూరులో బోరు పాయింట్‌ను గుర్తిస్తున్న జియాలజిస్ట్ (ఫైల్)



దుగ్గుంటరాజుపాలెంలో బోరు వేస్తున్న దృశ్యం

పొదలకూరు: మండలంలో బోర్ల నిర్మాణం వేగం అందుకుంది. గతేడాది ఒక్క నావూరుపల్లి పంచాయతీలో 36 బోర్లు మంజూరైతే అన్నింటిని వేశారు. 30 బోర్లలో నీరు బాగా వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బోరుతోపాటు మోటార్, విద్యుత్ సౌకర్యం కల్పిస్తుండడం వల్ల మెట్ట ప్రాంతానికి జలకళ పథకం వరంగా మారింది. మొగళ్లూరు, ఆల్తుర్తి, కనుపర్తి, చెన్నారెడ్డిపల్లి, నావూరు, తోడేరు, ఊసపల్లి, పులికల్లు, కనుపర్తి, దుగ్గుంట తదితర గ్రామాల్లో జియాలజిస్టులు బోరు పాయింట్లను గుర్తించారు.

1,011 దరఖాస్తులు

వైఎస్సార్ జలకళ పథకం కోసం సర్వేపల్లి నియోజకవర్గంలో 1,011 దరఖాస్తులు రైతుల నుంచి అందాయి. వీటిని ఆయా గ్రామ వీఆర్వోలు పరిశీలించి 931 మంజూరు చేశారు. 930 అభ్యర్థనలను ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ ద్వారా ఫీల్డ్ సర్వే నిర్వహించారు. 368 దరఖాస్తులను కాంట్రాక్టర్ జియాలజిస్టులకు నివేదిక అందజేశారు. పొదలకూరు మండలం నుంచి 912, మనుబోలు నుంచి 49, టీపీ గూడూరు నుంచి 4, వెంకటాచలం నుంచి 46 దరఖాస్తులు రైతుల నుంచి వచ్చాయి. ముత్తుకూరు మండలం నుంచి అందలేదు. టీపీ గూడూరు, ముత్తుకూరు డెల్టా ప్రాంతాలైనందున బోర్ల నిర్మాణానికి రైతులు మొగ్గు చూపలేదు. పొదలకూరు మండలం నుంచే అత్యధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఫలితంగా ఈ మండలంలో బోర్ల నిర్మాణం చేపడుతున్నారు. పదిరోజులుగా ముమ్మరంగా బోర్ల నిర్మాణం జరుగుతోంది. మండలంలో సుమారు 500 బోర్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మెట్ట రైతులకు వరం



మెట్ట ప్రాంత రైతులకు వైఎస్సార్ జలకళ పథకం వరం. ఈ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. నిమ్మతోటల్లో బోర్లు లేని వారు దరఖాస్తు చేసుకుని బోర్లు వేయించుకుంటున్నారు. మంత్రి కాకాణి చొరవ వల్లే బోర్లు మంజూరయ్యాయి.
– ఉడతా రమేష్, సర్పంచ్, నేదురుమల్లి

వేగంగా పనులు



జలకళ పథకంలో భాగంగా ప్రాధాన్యతా క్రమంలో బోర్ల నిర్మాణం చేపడుతున్నాం. పొదలకూరు మండలంలో మెట్టరైతుల నిమ్మతోటలు, పొలాల్లో వేగంగా బోర్లు వేస్తున్నారు. ఆగస్ట్ 15వ తేదీ తర్వాత మోటార్లు కూడా బిగించే అవకాశం ఉంది.
– శ్రీహరిరెడ్డి, ఏపీడీ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్

నిత్యం ప్రజల్లో ఉంటూ.. సాయం చేస్తూ..



నిర్మాణం పూర్తయిన సైడ్ డ్రైయిన్లను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యేపై ఎంపీ వేమిరెడ్డి ప్రశంసలు
- రూ.1.29 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

కొడవలూరు: 'కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. ఆపదలో ఉన్న వారికి ట్రస్ట్ ద్వారా సాయం చేస్తున్నారు. ఆయనది మంచి మనసు' అని రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కమ్మపాళెంలో రూ.1.29 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను వేమిరెడ్డి ఎమ్మెల్యే ప్రసన్నతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో రూ.65 లక్షలతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లను, అదేవిధంగా రూ.25 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసన్నకుమార్ రెడ్డి గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. నిరంతరం ప్రజల్లో ఉండడంతోపాటు వ్యక్తిగతంగానూ సొంత నిధులతో అనేక మందికి సాయపడుతుండడం ఎమ్మెల్యే మంచితనానికి నిదర్శనమని ప్రశంసించారు. ఇంతటి చిన్న గ్రామంలోనే రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేసి ఉండడంతోపాటు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎమ్మెల్యే అందిస్తున్న సాయం ఆయనలోని మానవత్వాన్ని చాటిందన్నారు. ఎంతో రాజకీయ విజ్ఞానం ఉన్న ప్రసన్న లాంటి వారు ఎమ్మెల్యేలుగా ఉంటే ఆ నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో పయనించినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎంపీపీ జి.జ్యోతి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఏఓ లక్ష్మి, ఎంపీటీసీ పి.అరుణకుమారి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ సీహెచ్.లక్ష్మయ్య, నాయకులు బెల్లం వెంకయ్యనాయుడు, వెంకట నగేష్‌నాయుడు, జి.మస్తానయ్య, కె.రమేష్ నాయుడు, నాపా రమేష్, కేతినేని హరికృష్ణ, పోసిన వెంకటేశ్వర్లు, ఎ.షడ్రక్, టి.తిరుపతి, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఉద్యమంలా మొక్కలు నాటాలి

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని యువత ఉద్యమంలా మొక్కలు నాటాలని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత అన్నారు. గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీల్లో అధికారులు, ప్రజాప్రతినిధుల మొక్కలు నాటారు. తోటపల్లి పంచాయతీలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఎంపీపీ స్వర్ణలత మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంపీడీఓ హేమలత, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, స్థానిక సర్పంచ్ దానా స్వాతి, మాజీ సర్పంచ్ ఈదూరు రామాచార్యులు, ఎంబేటి వీరరాఘవులు, ధనుంజయ, ఇంగిలాల మనోహర్, తాడి రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి శంకర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా మత్స్య కళాశాల వార్షికోత్సవం

ముత్తుకూరు: ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో శుక్రవారం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మత్స్య విశ్వవిద్యాలయం స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ డాక్టర్ ఓ.సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువులు కొనసాగిస్తూనే పోటీ పరీక్షలు రాయాలని సూచించారు. మత్స్య రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని చెప్పారు. మత్స్యశాస్త్రం పూర్తి చేసిన వారు ప్రభుత్వ రంగంలో ఉద్యోగాల సాధనకు తమవంతు కృషి చేస్తామన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రొఫెసర్లు అభినందించారు. కార్యక్రమంలో స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ డాక్టర్ టీవీ రమణ, ఫిషరీస్ సైన్స్ డీన్ డాక్టర్ రవీంద్రకుమార్‌రెడ్డి, అసోసియేట్ డీన్ డాక్టర్ బాలసుబ్రహ్మణియన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్

సెప్టెంబర్ నుంచి మన ఊరు – మన ఎమ్మెల్యే

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: సెప్టెంబర్ 25వ తేదీ నుంచి కోవూరు నియోజకవర్గంలో మన ఊరు – మన ఎమ్మెల్యే అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కమ్మపాళెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆగస్ట్ నెలతో పూర్తవుతుందన్నారు. సెప్టెంబర్ నుంచి నూతన కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. మన ఊరు – మన ఎమ్మెల్యేలో భాగంగా చిన్న గ్రామాల్లో గంట, పెద్ద గ్రామాల్లో రెండు గంటల సమయం కేటాయించడం జరుగుతుందన్నారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య చిన్న చిన్న మనస్పర్థలుంటే వెంటనే పరిష్కరిస్తానని చెప్పారు. అదేవిధంగా ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. కొడవలూరు మండలంలో 16 సచివాలయాల పరిధిలో 16 వేల గడపలు పూర్తి చేసినట్లు చెప్పారు. రూ.122 కోట్లకు పైగా సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చినట్లు తెలిపారు. సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిమిత్తం 16 సచివాలయాలకు రూ.3.20 కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. కోవూరు నియోజకవర్గంలోని 78 సచివాలయాల పరిధిలో 89,291 గడపలు ఇప్పటి వరకు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు.

ఉపాధి హామీ పనుల్లో మొదటి స్థానం

- డ్వామా పీడీ వెంకట్రావు

పొదలకూరు: ఉపాధి హామీలో కూలీలకు పనులు కల్పించడంలో రాష్ట్రంలోనే నెల్లూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలిచినట్లు డ్వామా పీడీ డి.వెంకట్రావు తెలిపారు. ఐఏఎస్ ఆఫీసర్స్ వైఫ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డులో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమంలో పీడీ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 1.13 కోట్లు పనిదినాలను లక్ష్యంగా ఇచ్చారన్నారు. జూలై వరకు 67 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్ణయించగా జిల్లాలో 77.30 లక్షలు పనిదినాలను పూర్తి చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. ఇందులో మంత్రి, జిల్లా కలెక్టర్, ఉద్యోగులు, ప్రజాప్రతినిధుల సహకారం ఉందన్నారు. జిల్లాలో ఎన్నడూ లేని విధంగా కూలీలకు రూ.258 సరాసరి వేతనం గిట్టుబాటు అయ్యిందన్నారు. గతంలో ఆ మొత్తం రూ.202 మాత్రమే ఉందన్నారు. జిల్లాలో అవెన్యూ ప్లాంటేషన్ కింద 100 కి.మీ ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌కు ఇవ్వడం జరిగిందన్నారు. ఇనిస్టిట్యూషన్ ప్లాంటేషన్ కింద 20 సంస్థలను లక్ష్యంగా కేటాయించారని అందులో భాగంగానే యార్డులో ఉపాధి హామీ కింద మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగు కింద 700 ఎకరాలు లక్ష్యంగా నిర్ణయించడగా ఇప్పటి వరకు 800 ఎకరాల్లో మొక్కలు నాటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పెదమల్లు రత్నమ్మ, పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, యార్డు సెక్రటరీ నవీన్‌కుమార్‌రెడ్డి, డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఏపీఎం మధుసూదన్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యార్డు ప్రాంగణంలో మొక్క నాటిన పీడీ, ఏఎంసీ చైర్మన్ తదితరులు

13,331 మందికి సర్టిఫికెట్లు

పొదలకూరు: మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించి 23 సచివాలయాల పరిధిలో మొత్తం 13,331 మందికి సర్టిఫికెట్లను అందజేశామని ఎంపీడీఓ టి.నగేష్ కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ ఆధార్‌కార్డును మొబైల్ నంబర్‌కు లింకేజీ సేవలు 1,177 మందికి అందించామన్నారు. మండలంలో దాదాపు 83 శాతం ఇళ్లకు వెళ్లి సర్వే నిర్వహించినట్లు పేర్కొన్నారు. సచివాలయాల్లో నిర్వహించిన క్యాంప్‌ల ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు 6,091, ఆదాయ ధ్రువీకరణ 6,058, కొత్త రైస్‌కార్డులు 53, రైస్‌కార్డుల యాడింగ్ 285, వన్‌బీ 494, అడంగళ్ 201, ఆరోగ్యశ్రీకార్డులు 31, ఈడబ్ల్యూఎస్ 18, మ్యుటేషన్లు 2, ఫ్యామిలీ మెంబర్ 38 తదితర సర్టిఫికెట్లను అందజేశామని వెల్లడించారు.

వీఓఏలకు శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం

మనుబోలు: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వీఓఏలకు మూడురోజులుగా జరుగుతున్న శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వనజాక్షి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుంటూ పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకునేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక విధివిధానాలపై, నిధుల వినియోగంపై అకౌంట్ ఎలా నిర్వహించాలో వివరించారు. సమావేశంలో సీసీలు జయమ్మ, ధనమ్మ, దేవమ్మ, శ్రీనివాసులు, ఆదిశేషయ్య, అకౌంటెంట్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నేడు 14, 15 వార్డుల్లో గడప గడపకు..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 14, 15 వార్డుల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరిస్తారన్నారు. అలాగే స్థానికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

ఇందుకూరుపేట: వర్షాకాలం నేపథ్యంలో ముందస్తుగా పారిశుద్ధ్య పనులను చేపట్టాలని ఎంపీడీఓ నాగేంద్రబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరలో శుక్రవారం ఎంపీపీ శంకరయ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అన్ని శాఖల అధికారులు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటి వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీటీ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

- పోర్టు సీఓఓ సంజయ్



మొక్క పంపిణీ చేస్తున్న సంజయ్

ముత్తుకూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఓఓ సంజయ్ కొత్త అన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోర్టు పరిపాలనా భవనంలో ఉద్యోగులకు ఆయన మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉద్గారాల వల్ల ప్రమాదకరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రకృతితో ముడిపడి ఉన్న మన జీవన విధానాన్ని దెబ్బతినకుండా కాపాడుకోవాలన్నారు. దీనికి మొక్కలు నాటి, పెంపకం చేయడమొక్కటే మార్గమని చెప్పారు. కార్యక్రమంలో పోర్టు అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని వవ్వేరులో శుక్రవారం నెల్లూరుకు చెందిన కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలిత మాట్లాడుతూ మెడికల్ క్యాంప్‌లతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సుమారు 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీఏ రామారావు, వైద్యులు హారిక, జ్యోతి, నాయకుడు కోటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ముగిసిన కోటి కుంకుమార్చన



శాకంబరి అలంకారంలో కామాక్షితాయి




అమ్మవారిని దర్శించుకుంటున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు



కుంకుమార్చనలో పాల్గొన్న ఉభయకర్తలు, ఆలయ చైర్మన్ దంపతులు

- పూజల్లో పాల్గొన్న వేమిరెడ్డి దంపతులు
- నేడు మహాయజ్ఞం

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో ఈనెల 19వ తేదీన ప్రారంభమైన కోటి కుంకుమార్చన శుక్రవారంతో ముగిసింది. చివరిరోజు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి ఉత్తర భారతదేశ టీటీడీ దేవస్థానాలు, వేంకటేశ్వరస్వామి దేవస్థానాల ఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కాగా ఆలయంలో ఉదయం వివిధ పూజా కార్యక్రమాలు జరిగాయి. వంద మంది రుత్వికుల చేత కోటి కుంకుమార్చన మహాయజ్ఞాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం, కౌమారి పూజ, సుహాసిని పూజలను జరిపారు. రోజూ వంద మంది రుత్వికుల చేత 10 లక్షల ఆవర్తనాలను కుంకుమతో పఠించడంతో కోటి ఆవర్తనాలు పూర్తయ్యాయి. కోటి కుంకుమార్చనలో భాగంగా అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇంకా వినాయకుడిని పుచ్చకాయ, సొరకాయతో అందంగా తీర్చిదిద్దారు. ప్రత్యేకాలంకరణలో ఉన్న అమ్మవారిని కంచి కామాక్షి ఆలయ ప్రధాన అర్చకులు నటరాజస్వామి దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి – ప్రశాంతిరెడ్డి దంపతులు, కొలన్ రాజారెడ్డి – పూజిత దంపతులు, గగన్‌రెడ్డి దంపతులు వ్యవహరించారు. శనివారం మహాయజ్ఞాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా కోటి కుంకుమార్చలో భక్తుల కోసం పాలకమండలి సభ్యులు వసతులు కల్పించారు. ఎస్సై వీర ప్రతాప్ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, పద్మమ్మ, సుప్రజ, కామేశ్వరి, విమలమ్మ, శశిశేఖర్‌శర్మ పాల్గొన్నారు.



వినాయకుని ప్రతిమ



హోమం కోసం తాత్కాలిక ఏర్పాట్లు